క్లుప్తంగా

సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయం


కొమ్మూరు దుర్గారావు

భోగాపురం: ఇటీవల హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు తొలగించిన హెల్త్ అసిస్టెంట్లను తిరిగి నియమించుకోవాలని సుప్రీంకోర్టు బుధవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడం హర్షణీయమని ఏపీ ఎన్జీఓ భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మూడు మండలాల తాలుకా అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు అన్నారు. ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1200 మంది హెల్త్ అసిస్టెంట్లను తొలగించిన విషయం తెలిసిందే. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులు హెల్త్ అసిస్టెంట్లకు ఊరటనిచ్చాయన్నారు.

విజయవాడకు సైకిల్‌యాత్ర


యాత్రకు సిద్ధమైన భవానీ భక్తులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు, ఒమ్మి గ్రామాలకు చెందిన ఇద్దరు భక్తులు సైకిల్‌పై విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధికి బుధవారం పయనమయ్యారు. భవానీ భక్తులు అంబళ్ల అప్పలనాయుడు, కోరాడ గోవర్ధన్ భక్తి శ్రద్ధలతో ఇరుముడులు ధరించి సైకిల్ యాత్ర ప్రారంభించారు. సుమారు 450 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణించి అమ్మవారిని దర్శించుకోనున్నట్లు భక్తులు తెలిపారు. లోక కల్యాణార్థం మూడేళ్ల నుంచి సైకిల్‌యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

టార్పాలిన్ల పంపిణీ


రైతులకు టార్పాలిన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం రూరల్: వర్షాలకు పంటల దిగుబడులు తడిసిపోకుండా కాపాడుకునేందుకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే అదితి గజపతిరాజు రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశారు. మండలంలోని రాకోడులో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 24 గంటల్లో రైతు ఖాతాకు ప్రభుత్వం నగదు జమ చేస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఎ.నాగభూషణరావు, మండల వ్యవసాయశాఖాధికారి లత, ఎంపీటీసీ సభ్యుడు వేసలపు శ్రీను, జొన్నవలస ఎంపీటీసీ సభ్యుడు పూసపాటి రాజేష్, ఎంపీడీఓ తిరుపతినాయుడు, సచివాలయ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు


మండల పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

నెల్లిమర్ల: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోకి మార్చబడింది. గతంలో ఈ కార్యాలయం రామతీర్థం జంక్షన్ సమీపంలో కొండపైన ఉండేది. ఆ కార్యాలయాన్ని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని పాత ఎంపీడీఓ కార్యాలయంలోకి మార్చారు. దీంతో బుధవారం నుంచి సేవలు ప్రారంభమయ్యాయి.

సమష్టి కృషితోనే అభివృద్ధి

- ఎంపీడీఓ తిరుపతినాయుడు


శిక్షణకు హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న ఎంపీడీఓ తిరుపతినాయుడు

విజయనగరం రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీఓ తిరుపతినాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీల అభివృద్ధిపై రెండోరోజు కూడా శిక్షణ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ లక్ష్యాల మేరకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ముందుగా గ్రామాల్లో ఉంటున్న సమస్యలను గుర్తించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ సిబ్బందితో పాటు కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ కరువు..

- నిర్మాణాల్లో కానరాని నాణ్యతా ప్రమాణాలు
- కనీసం పట్టించుకోని అధికారులు


జొన్నవలసలో దగ్గరగా నిర్మించిన సీసీ డ్రెయిన్ గోడలు


ద్వారపూడి గ్రామంలో పలచగా చల్లిన క్రషర్

విజయనగరం రూరల్: మండలంలోని ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులపై కనీస పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. తెలుగు తమ్ముళ్లు కాంట్రాక్టర్ల అవతారం ఎత్తి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. పంచాయతీరాజ్ అధికారులు చెబుతున్నప్పటికీ కాంట్రాక్టర్లు తమకు నచ్చిన రీతిలో పనులు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధానంగా మండలంలో చేపడుతున్న సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్ల పనుల్లో డొల్లతనం స్పష్టంగా కనిపిస్తోంది.

పాటించాల్సిన ప్రమాణాలు..

గ్రామాల్లో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి మూడు అడుగుల వెడల్పు, రెండు అడుగుల ఎత్తులో కాలువను ముందుగా తవ్వాలి. అనంతరం నాలుగు ఇంచీల మేర 10 ఎంఎం, 20 ఎంఎం పిక్క మిక్సింగ్ చేసి కాంక్రీట్ వేయాలి. అలాగే కాలువుల గోడల మందం ఆరు ఇంచీలు ఉండేలా నిర్మాణం చేపట్టాలి.

- సీసీ రోడ్డు అయితే ముందుగా రోడ్డును చదును చేసుకుని రెండు ఇంచీల మేర క్రషర్ బుగ్గి వేయాలి. అనంతరం ఏడు ఇంచీల మేర కాంక్రీట్ వేసి సీసీ రోడ్డు మొత్తం 9 ఇంచీల ఎత్తు ఉండేలా నిర్మాణం జరగాలి. ఇటువంటి నిబంధనలతో మండలంలో ఎక్కడా పనులు చేయడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ద్వారపూడి, జొన్నవలస, పినవేమలి, గొల్లలపేట, కొండకరకాం, గుంకలాం, కోరుకొండ, తదితర గ్రామాల్లో పనులు జరుగుతున్నాయి.

కానరాని పర్యవేక్షణ

గ్రామాల్లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను సచివాలయ పరిధిలో ఉన్న ఇంజినీరింగ్ సహాయకులు పర్యవేక్షించి, నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే పనులు నిలిపివేయవచ్చు. అయితే అధికార పార్టీ నాయకుల ఒత్తిడికి వారు పర్యవేక్షించడం లేదనే విమర్శలున్నాయి. అలాగే అధికార పార్టీకి చెందిన నాయకులు తమ పార్టీ కార్యకర్తలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే సీసీ డ్రెయిన్లు, సీసీ రోడ్లు ఏర్పాటు చేసుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

అధికారులు పట్టించుకోవాలి..



గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారుల పర్యవేక్షించాలి. కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసి వెళ్లిపోవడంతో కాంట్రాక్టర్లు తమకు నచ్చినట్లు పనులు చేస్తున్నారు. నిత్యం పనులు జరుగుతున్న తీరును పరిశీలిస్తే అందులోని లోపాలు తెలుస్తాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి

– కర్రోతు నారాయణ, వైస్ ఎంపీపీ, గుంకలాం

ప్రజాధనం వృథా..



ద్వారపూడిలో శ్మశానానికి వెళ్లే రహదారిలో ఇటీవల రూ.70 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన జరిగింది. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులే ఈ పనులు చేపడుతున్నారు. ఏమాత్రం నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా డ్రెయిన్లు నిర్మిస్తున్నారు. శాశ్వతంగా ఉండాల్సిన నిర్మాణాలు నాణ్యతా లోపంతో చేపడుతుండడంతో ప్రజాధనం వృథా అవుతోంది.

–వెంపడాపు గౌరినాయుడు, ద్వారపూడి

మా దృష్టికి వచ్చింది..

మండలంలోని తొలి విడతలో రూ.4.86 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నాం. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు కూడా పర్యవేక్షణ చేపట్టడం లేదనే విషయం మా దృష్టికి వచ్చింది. అభివృద్ధి పనులను పర్యవేక్షించి, నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

–శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ, విజయనగరం మండలం

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

- తహసీల్దార్ సుదర్శనరావు


ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ సుదర్శనరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయోగడతాయని తహసీల్దార్ సుదర్శనరావు అన్నారు. మండలంలోని ఒమ్మిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అంతకుముందు గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అంబళ్ల అప్పలనాయుడు, రెడ్డి నారాయణరావు, రెడ్డి సత్యం, రామ్మూర్తి, ఆర్‌వి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చాలి

- ఇన్‌చార్జ్ ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్ అప్పారావు


108 అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న కో ఆర్డినేటర్ అప్పారావు

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రికి చేర్చాలని ఇన్‌చార్జ్ ఆరోగ్యశ్రీ (ఎన్టీఆర్ వైద్యసేవ) జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కొయ్యాన అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న 108 అంబులెన్స్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంబులెన్స్ తీసే ముందు కండీషన్ చెక్ చేసుకోవాలన్నారు. అంబులెన్సులో ఉండాల్సిన పరికరాలు అన్నీ పనిచేసే విధంగా చూసుకోవాలని తెలిపారు. రోగుల వివరాలు పూర్తి స్థాయిలో రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చేయూతనివ్వాలి


కోచ్ సంతోష్‌కుమార్‌కు చెక్‌ను అందజేస్తున్న సత్య విద్యాసంస్థల డైరెక్టర్ శశిభూషణరావు

- సత్య విద్యాసంస్థల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం టౌన్: విద్యార్థులు ఉన్నత రంగాల్లో రాణించాలంటే వారికి అన్ని రకాలుగా చేయూతనివ్వాలని, అప్పుడే వారంతా విజయకేతనం ఎగురవేస్తారని సత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు అన్నారు. తోటపాలెం సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో కరాటే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు రూ.10 వేల నగదు బహుమతిని కళాశాల ఆవరణలో కోచ్ సంతోష్‌కుమార్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడకారులు ఈ నెల 27, 28 తేదీల్లో పశ్చిమ బెంగాల్ ఖరగ్‌పూర్ గీతాంజలి ఇండోర్ స్టేడియంలో ఖరగ్‌పూర్ యువ కరాటే కెన్యూ రీయు కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 24వ జాతీయ జపాన్ కరాటే చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు వెళ్తున్నారన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ నగదు బహుమతి అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ.సాయిదేవమణి, ఎన్‌సీసీ ఆఫీసర్లు కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎం.ఉదయ్‌కిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నదాతలూ అప్రమత్తం..


డెంకాడ: పొలాల్లో ఉన్న వరి గాలి దిబ్బలను పరిశీలిస్తున్న ఏఓ నిర్మల

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల చెదురుముదురు జల్లులు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. వరి కోతలు, నూర్పులను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే నూర్పులు పూర్తి చేసిన వారు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని.. ఒకవేళ కళ్లాల్లో ఉన్నట్లయితే టార్పాలిన్లు కప్పాలన్నారు. ఇదిలా ఉంటే వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో రైతులు దిగుబడులను కాపాడుకునే పనిలో బిజీగా ఉన్నారు.

– డెంకాడ/విజయనగరం రూరల్


విజయనగరం రూరల్: రాకోడులో వరిచేనుపై వేసిన టార్పాలిన్లు


విజయనగరం రూరల్: గుంకలాంలో వరి దిబ్బలు వేసేందుకు సన్నద్ధమవుతున్న రైతన్నలు


నెల్లిమర్ల రూరల్: కొండవెలగాడలో రైతులకు సూచనలు అందిస్తున్న అధికారులు

ఉపాధి పనుల పరిశీలన పూర్తి

విజయనగరం రూరల్: మండలంలోని 22 పంచాయతీలకు సంబంధించి 2023 – 24 వార్షిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనుల పరిశీలన బుధవారంతో పూర్తయిందని ఎస్‌ఆర్‌పీ కె. మన్మధరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో నాలుగు బృందాలు పది రోజుల్లో పరిశీలన పూర్తి చేశాయని చెప్పారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో గురువారం సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

డిప్యూటీ సీఎం రాకపై సమీక్ష


సిబ్బందితో సమీక్షిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

భోగాపురం: మన్యం జిల్లా పర్యటనలో భాగంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గురువారం రాత్రి మండలంలోని సన్‌రే రిసార్ట్స్‌కు రానున్న నేపథ్యంలో చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ ఎం. శ్రీనివాసరావు సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిప్యూటీ సీఎం శుక్రవారం మన్యం జిల్లాకు వెళ్లనున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ప్రధాన కూడళ్ల వద్ద బందోబస్తు ఏర్పటు చేయాలన్నారు. తుఫాన్ ప్రభావం వల్ల భారీ వర్షాలు పడితే పర్యటన రద్దయ్యే అవకాశం కూడా ఉందన్నారు. సమావేశంలో సీఐ ఎన్వీ ప్రభాకర్, ఎస్సైలు పాపారావు, సూర్యకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలి

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి. రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక ఎల్‌బీజీ భవన్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2019లో విజయనగరం పట్టణంలో ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇంతవరకు సొంత భవనం లేకపోవడం దారుణమనానరు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చిన్నబాబు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల అవగాహన



టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై వంద రోజుల పాటు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తామని డెంకాడ పీహెచ్‌సీ డాక్టర్ ఎం.శివరామకృష్ణ అన్నారు. డెంకాడ మండలంలోని అక్కివరం గ్రామంలో టీబీపై బుధవారం అవగాహన కల్పించారు. వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన చికిత్సలను వివరించారు. గ్రామాల్లో టీబీ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కంది కిరణ్‌కుమార్, సూపర్‌వైజర్ సీహెచ్ శ్రీనివాస్, వైద్య అధికారులు, సిబ్బంది, ఆశ వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.– డెంకాడ

ధ్రువపత్రాల పంపిణీ..



ఆర్య వైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆరు నెలల కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక ఉల్లివీధి ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో 45 మంది మహిళలకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని చెన్నయశెట్టి (నానాజీ) మాట్లాడుతూ.. 26 సంవత్సరాల నుంచి మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే అసోసియేషన్ తరపున ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కుట్టు శిక్షకురాలు శారద, సంఘ కార్యదర్శి పేర్ల సీతారామయ్యశెట్టి, కోశాధికారి కందుల సంతోష్, ఏడుకొండలు, వజ్రపు కృష్ణారావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– విజయనగరం

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి..


విద్యార్థులతో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జీరావు, తదితరులు

- ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బాబ్జి

నెల్లిమర్ల రూరల్: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం నార్కోటిక్ చట్టాలు కఠినంగా ఉన్నాయన్నారు. యువత చెడు అలవాట్లకు బానిసై బంగారు జీవితాన్ని కోల్పోవద్దని సూచించారు. చెడు స్నేహాలు విడిచిపెట్టి మంచివైపు పయనించాలని కోరారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాధుడు మాట్లాడుతూ.. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లోనే యువత అత్యధికంగా ఉన్నారని, నైపుణ్యంతో ముందడుగు వేస్తే దేశాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ ఎస్ వర్మ, ఎక్సైజ్ సీఐ జనార్ధన్ పాల్గొన్నారు.

విషయ పరిజ్ఞానం తప్పనిసరి


ప్రొఫెసర్ ఎస్.మోహన్‌కుమార్‌ను సత్కరిస్తున్న మహారాజా కళాశాల ప్రిన్సిపాల్ సాంబశివరావు, తదితరులు

విజయనగరం టౌన్: విద్యార్థులకు మంచి మార్కులతో పాటు ప్రతి సబ్జెక్ట్‌లో పూర్తి విషయ పరిజ్ఞానం తప్పనిసరని ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఆంగ్ల విభాగాధిపతి ఎస్.మోహన్‌కుమార్ అన్నారు. మహారాజా స్వయం ప్రతిపత్తి కళాశాలలో రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఇంటర్ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పబ్లిక్ పరీక్షలకు హాజరుకావాలన్నారు. మూడు నెలల పాటు బాగా కష్టపడి చదివితే బంగారు భవిష్యత ఉంటుందని చెప్పారు. అనంతరం మోహన్‌కుమార్‌ను నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు, విభాగాధిపతి వి.బాబ్జీ, కన్వీనర్లు పీఎస్ఎన్.రావు, డి.సన్యాసిరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.